# నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 26 ఫిబ్రవరి 2025 RANGAREDDY


## మహిళా ఆర్థిక సాధికారతపై 2కే వాకథాన్



ఆర్బీఐ, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో 2కే వాకథాన్ నిర్వహించారు. ఆర్బీఐ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, మహిళలు, ఉస్మానియా విద్యార్థులతో సహా 400 మంది వాకథాన్‌లో భాగమయ్యారు. - సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ)



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

## ఆరు గ్యారెంటీల అమలేదీ? : ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ సర్కారు అబద్ధాలతో కాలం వెల్లబుచ్చుతున్నదని, 14 నెలలు గడిచినా సర్కారు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు అబద్దాలతో ప్రభుత్వాన్ని నడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు.

# పీఠముడి వీడేనా..



నిషేధిత జాబితాలో నుంచి తమ పేర్లను తొలగించి, తమ భూములు తమకు ఇప్పించాలని కలెక్టర్ కార్యాలయానికి ట్రాక్టర్లతో వెళుతున్న బాధిత రైతులు (ఫైల్)

- రైతుల పేర్లమీదికి ఫార్మా భూములు మారుస్తామంటూ ఎన్నికల ముందు కాంగ్రెస్ హడావుడి
- ఫార్మా గ్రామాల్లో తిరిగి హామీలిచ్చిన కాంగ్రెస్ అగ్రనేతలు
- 14 నెలల నుంచి పట్టించుకోవడం లేదని స్థానికుల ఆవేదన
- భూమి లేదని పిల్లనివ్వటంలేదని ఓ రైతు ఆవేదన
- రైతుల భూపోరాటం ఫలించేనా..?

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని ఫార్మా సిటీకి కేటాయించిన పట్టా భూములను రైతుల పేర్లమీదికి మారుస్తామంటూ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ముందు హడావుడి చేసింది. అధికార పగ్గాలు చేపట్టి 14 నెలలు దాటినా ఆ ఊసే లేదు. అధికారులను అడిగితే తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. భూమి లేదని పిల్లనివ్వటంలేదని ఓ రైతు వాపోయాడు. ఏ రైతును కదిలించినా తమ బాధను వెళ్లగక్కుతున్నారు. పట్టా భూములు కలిగిన రైతులు చేస్తున్న భూపోరాటంలో రైతుల పక్షాన విజయం వరిస్తుందా అన్నదానిపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

- రంగారెడ్డి, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ)

### హామీని మరిచారు

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఫార్మా అనుబంధ గ్రామాల్లో రైతుల పట్టా భూములు ఎక్కడికీ పోవని, తాము అధికారంలోకి రాగానే ఇప్పిస్తామని ప్రస్తుత మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా బాధిత గ్రామాల్లో పర్యటించి రైతులకు హామీ ఇచ్చారు. అలాగే, ఈ ప్రాంతానికి చెందిన రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కూడా బాధిత గ్రామాల్లో పర్యటించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అథారిటీలో జమచేసిన డబ్బులను తిరిగి ప్రభుత్వానికి పంపించి, రైతులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాని, ఇప్పటివరకు ఆ హామీని మర్చిపోయి రైతులకు ఏమాత్రం న్యాయం చేయలేదు. 'మా భూములను మాకిప్పించండి' అని అధికార పార్టీ నాయకులను వేడుకున్నా పట్టించుకోవటంలేదు. ఒక్క వినోద్‌రెడ్డే కాకుండా ఫార్మా అనుబంధ గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో ఏ రైతును కదిలించినా తమ బాధను వెళ్లగక్కుతున్నారు.

### భూమిలేదని పిల్లనివ్వటంలేదు..!



'మాది వ్యవసాయ కుటుంబం.. వ్యవసాయంపై ఆధారపడి మా తాతలు.. తండ్రులు, మేము జీవిస్తున్నాం. మా భూములను ఫార్మాసిటీ కోసం బలవంతంగా తీసుకుని.. నిషేధిత జాబితాలో చేర్చి మాకు వచ్చే రైతు బంధు రుణాలను కూడా ఇవ్వకుండా చేశారు. మా పేరున భూమి లేకపోవటంతో పెళ్లి చేసుకోవటానికి ఎవరూ పిల్లను కూడా ఇవ్వటంలేదు. దయచేసి మా భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించి మా పేర్లను రికార్డుల్లో చేర్చండని' ఫార్మా అనుబంధ గ్రామమైన కుర్మిద్ద గ్రామానికి చెందిన రైతు వినోద్‌రెడ్డి వాపోతున్నాడు.

### నిషేధిత జాబితాలో ఉన్న భూములు

| గ్రామం | ఎకరాలు |
|---|---|
| మేడిపల్లి | 483 |
| నానక్‌నగర్ | 154 |
| తాటిపర్తి | 382 |
| కుర్మిద్ద | 974 |

### రైతుల డబ్బులను అథారిటీలో జమచేశారు




ఫార్మాసిటీ కోసం ఇప్పటికే తాటిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద, మేడిపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతుల పట్టా భూములకు సంబంధించి గతంలోనే భూసేకరణ జరిగిపోయింది. సుమారు 2500 ఎకరాల పట్టా భూములకు సంబంధించి పరిహారం కూడా భూసేకరణ అథారిటీలో జమచేయటం జరిగింది. భూసేకరణ జరిగిపోయినందునే రైతుల పేర్లను నిషేధిత జాబితాలో నుంచి ఆ భూములను టీజీఐఐసీ పేరుమీదకు చేర్చటం జరిగింది. ఒక్కసారి భూసేకరణ జరిగిన తర్వాత తిరిగి రైతులకు భూములు ఇవ్వటం అంత సులువు కాదు. గతంలోనే ఈ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. తిరిగి రైతులకు ఇవ్వటం జరగదు.

- ఆర్డీవో అనంతరెడ్డి

## ఒకే కుటుంబంలా పనిచేయాలి

### బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



నూతనంగా ఎన్నికైన వారిని సన్మానించిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

వికారాబాద్, ఫిబ్రవరి 25 : బీఆర్ఎస్ పార్టీ నాయకులందరూ ఒక కుటుంబం మాదిరిగా పని చేస్తూ ముందుకు సాగాలని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో అంతర్గత సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం వికారాబాద్‌లో వార్డులవారీగా పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు మాజీ కౌన్సిలర్ గోపాల్ ముదిరాజ్‌ను పట్టణ అధ్యక్షుడిగా, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సుభాన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా గాండ్ల మల్లికార్జున్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైనవారికి మెతుకు ఆనంద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయపరుస్తూ పార్టీ పటిష్టతే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. తనపై నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు మెతుకు ఆనంద్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, రాష్ట్ర నాయకుడు శుభప్రద్‌పటేల్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అనంత్‌రెడ్డి, షఫీ, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు అశోక్, సీనియర్ నాయకులు దేవదాసు, మల్లేశం, నాయకులు రమణ, అనంతయ్య, సురేశ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, వికారాబాద్ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ముర్తుజా అలీ, వికారాబాద్ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు గిరీశ్ కొఠారీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## బాధ్యతగా వ్యవహరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- చీఫ్ సూపరింటెండెంట్లు, మండల విద్యాధికారులతో సమావేశం

వికారాబాద్, ఫిబ్రవరి 25 : జిల్లాలో జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి బాధ్యతగా వ్యవహరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం సమావేశం హాలులో విద్యా శాఖ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పరీక్షలు మార్చి 21 నుంచి ప్రారంభమవుతాయని, జిల్లాలో 69 పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగిందన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాలను ఒక రోజు ముందుగానే సందర్శించి, ప్రతి రోజూ ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సిందిగా సూచించారు. విద్యార్థులు, పరీక్షలను నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎలాంటి ఎలక్ట్రికల్ వస్తువులు, సెల్‌ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురాకూడదని సూచించారు. పరీక్ష కేంద్రంలో, పరిసరాల్లో సెల్‌ఫోన్‌లను పూర్తిగా నిషేధించినట్లుగా తెలిపారు. 6450 మంది బాలురు, 6453 మంది బాలికలు మొత్తం 12903 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.


ఎక్కడ కూడా చిన్న సమస్య రాకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వెళ్లాలని, పరీక్షలకు సంబంధం లేని వ్యక్తులెవరిని కూడా పరీక్ష హాలులోకి అనుమతించరాదని, మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఈవో రేణుకాదేవి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన విద్యాశాఖ అధికారులు, సిబ్బంది

# పడకేసిన పాలన

### వారానికి ఒక్కరోజు కూడా గ్రామపంచాయతీలకు రాని ప్రత్యేకాధికారులు




- సమస్యలు చెప్పుకొనేందుకు ఎవరూ లేకపోవడంతో ప్రజల ఇబ్బందులు
- నిధులు లేక పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యలు
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయని వైనం
- పంచాయతీ కార్మికులకు జీతాలు అందక అవస్థలు
- డీజిల్‌కు కూడా డబ్బులు లేకపోవడంతో మూలన పడిన ట్రాక్టర్లు
- నిధుల సమస్యతో పైప్‌లైన్ లికేజీలు, వీధిదీపాలు అమర్చలేక సమస్యలకే కేరాఫ్‌గా జీపీలు
- అధ్వానంగా మారిన పారిశుధ్యం

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించారు. అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు ఆగిపోవడం, మరోవైపు గ్రామపంచాయతీల్లో పాలన చూడాల్సిన ప్రత్యేకాధికారులు పత్తా లేకుండా పోవడంతో పాలన పడకేసింది. జిల్లా ఉన్నతాధికారులు గ్రామపంచాయతీల్లో పర్యటించేందుకు వస్తే తప్ప ప్రత్యేకాధికారులు రావడంలేదని ప్రజలు చెబుతున్నారు. కనీసం వారానికి ఒక్కరోజు కూడా గ్రామాలకు ప్రత్యేకాధికారులు రాకపోవడంతో గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వికారాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ)

### సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గ్రామపంచాయతీలు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ గ్రామపంచాయతీలుగా రూపుదిద్దుకున్న గ్రామపంచాయతీల్లోనూ కాంగ్రెస్ ఏడాది పాలనలో అభివృద్ధి పడకేసింది. గ్రామపంచాయతీలకు నయా పైసా నిధులివ్వకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. ప్రత్యేకాధికారులను నియమించారే తప్ప కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోవడం, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. వేసవికాలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు స్థానికంగా చిన్నచిన్న కాంట్రాక్టర్లతో చేయించిన మరమ్మతు పనులకు సంబంధించిన రూ.4 కోట్ల నిధులు కూడా ఇప్పటివరకు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలు దేశంలోనే ఆదర్శం కాగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీల్లో పరిస్థితి అధ్వానంగా మారిపోయింది. గతేడాదిగా పంచాయతీ కార్మికులకు జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### నిధులు లేక పాలనకు దూరం

ప్రత్యేకాధికారులుగా నియమించిన తర్వాత నెలరోజులపాటు వెళ్లిన ప్రత్యేకాధికారులు తదనంతరం గ్రామపంచాయతీల్లో నయా పైసా నిధులు కూడా లేకపోవడంతో గ్రామపంచాయతీలకు పోవడం మానేశారనే అభిప్రాయం ప్రత్యేకాధికారుల నుంచి వ్యక్తం అవుతున్నది. గత వేసవి సమయంలో గ్రామపంచాయతీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మరమ్మతుల పనులకు సంబంధించి పూర్తి చేసిన పనుల బిల్లులే రాకపోవడంతో ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీలవైపు చూడడం లేదనే వాదన వినిపిస్తున్నది. అదే విధంగా జిల్లాస్థాయి మొదలుకొని మండల స్థాయి వరకు అన్ని శాఖల అధికారులను గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఆయా శాఖల్లోని రెగ్యులర్ పనులతోపాటు ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించి ప్రత్యేకాధికారి పనులను కూడా నిర్వహించాల్సిన పరిస్థితి. ఒక్కో అధికారికి రెండు గ్రామాలకు ప్రత్యేకాధికారిగా నియమించిన జిల్లా ఉన్నతాధికారులు ఆయా మండలాల్లోని అటు చివర, ఇటు చివర ఉండే గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారుల బాధ్యతలు అప్పగించడం కూడా సమస్యగా మారింది. మరోవైపు ఎన్నికలు నిర్వహిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయనుకుంటే ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక లేకుండా ముందుకు వెళ్తుండడంతో ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారనేది స్పష్టత లేకుండా పోయింది.

### పారిశుధ్యం అస్తవ్యస్తం

డ్రైనేజీ పైప్‌లైన్‌కు కూడా మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొనడంతో గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అద్దంలా మెరిసిన రోడ్లు ప్రస్తుతం మురుగు నీటితో దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో దయనీయ పరిస్థితి నెలకొన్నది. దీనికి తోడు వ్యాధులు ప్రబలుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామానికి ఇచ్చిన ట్రాక్టర్లు ప్రస్తుతం మూలనపడ్డాయి. ట్రాక్టర్లకు ఈఎంఐ కట్టలేని పరిస్థితితోపాటు ట్రాక్టర్ల నిర్వహణకు కనీసం డీజిల్‌కు కూడా డబ్బులు లేకపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. ట్రాక్టర్లు మూలన పడడంతో ఇంటింటికెళ్లి తడి-పొడి చెత్త సేకరించే ప్రక్రియ కూడా గ్రామాల్లో నిలిచిపోయింది. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయింది.



మహాశివరాత్రి సందర్భంగా విద్యుత్ కాంతుల మధ్య వెలుగొందుతున్న మహేశ్వరంలోని శివాలయం

## పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

### రికార్డ్ స్థాయిలో విద్యుత్ వినియోగం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : ఎండలు మండిపోతున్నాయి. గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటిపోతున్నాయి. ఈ ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో విద్యుత్ వినియోగం డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్నది. ఫిబ్రవరి మొదటి రెండు వారాలు సగటున డిమాండ్ 60 మిలియన్ యూనిట్లు నమోదు కాగా, తాజాగా 73 మిలియన్ యూనిట్లకు చేరింది.

### ఫిబ్రవరిలోనే ఏప్రిల్ డిమాండ్

సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కానీ గతంలో ఏప్రిల్‌లో నమోదైన గరిష్ఠ డిమాండ్ 3435 మెగావాట్లు దాటి ప్రస్తుతం ఈ ఫిబ్రవరిలో 3455 మెగావాట్ల డిమాండ్ నమోదవుతున్నది. ఈ నేపథ్యంలో మార్చి, ఏప్రిల్‌లో ఏ మేరకు డిమాండ్ నమోదవుతుందోనన్న ఆందోళనలో సిబ్బంది ఉన్నారు. మే మొదటి వారానికి రోజుకు సగటున 100 ఎంయూలు దాటే అవకాశం ఉన్నట్లుగా డిస్కం అంచనా వేస్తున్నది. విద్యుత్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో టీజీఎస్పీడీసీఎల్ ఇంజినీర్లలో ఆందోళన మొదలైంది. వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం డిస్కం ముందస్తు లైన్ల పునరుద్ధరణ చర్యలను ఇంజినీర్లు చేపడుతున్నారు.

### క్షేత్రస్థాయిలో సీఎండీ పర్యటన

సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను పూర్తిచేయడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇంజినీర్లతో పాటు క్షేత్రస్థాయిలో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పర్యటిస్తున్నారు. ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తూ ఫైల్స్ క్లియరెన్స్ లేని చోట సీరియస్ అవుతున్నారు. పనులు పూర్తికాని చోట వెంటనే పూర్తి చేయాలని చెబుతున్నారు. అయితే శివారు ప్రాంతాల్లో కనెక్షన్లు పెరగడం, డిమాండ్ పెరుగుతుండడంతో లోడ్ అధికమవుతున్నది. ఇప్పటికే ఏప్రిల్ రికార్డు రీచ్ అయిన నేపథ్యంలో సీఎండీ ఎప్పటికప్పుడు ఎస్ఈలు, సీజీఎంలు, డీఈలతో సమావేశాలు పెట్టి లైన్ల పునరుద్ధరణ, కొత్త లైన్ల ఏర్పాటుపై సమీక్షిస్తున్నారు.

## 9999 నంబర్‌కు రూ.4.55 లక్షలు

### జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి



వికారాబాద్, ఫిబ్రవరి 25 : వికారాబాద్ జిల్లాలోని పరిగి యూనిట్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన వేలంపాటలో '9999' నంబర్‌కు భారీ ధర పలికిందని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నంబర్‌ను గిరిజాపురం మాధవరెడ్డి రూ.4,55,450లకు దక్కించుకున్నారన్నారు. కొత్త సిరీస్ ప్రారంభం కావడంతో ఈసారి పరిగి యూనిట్ కార్యాలయానికి రూ.7,17,149 ఆదాయం లభించినట్లు ఆయన పేర్కొన్నారు.

## మార్చి 8న రన్ ఫర్ యాక్షన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8న హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించే హైదరాబాద్ సిటీ పోలీస్ రన్ ఫర్ యాక్షన్-2025 పోస్టర్‌ను, రిజిస్ట్రేషన్ లింక్‌ను పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం తన కార్యాలయంలో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్యతో కలిసి ఆవిష్కరించారు. మార్చి 8న ఉదయం ఆరు గంటల నుంచి నెక్లస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరిగే ఈ ఈవెంట్‌లో 5కే, 2కే రన్ నిర్వహిస్తామని, మహిళలంతా కార్యక్రమంలో పాల్గొనడానికి ముందుకు రావాలని సీపీ పిలుపునిచ్చారు. మహిళల రక్షణ కోసం హైదరాబాద్ కమిషనరేట్ పోలీస్ నిరంతరం కృషి చేస్తున్నదని, యాక్సిలరేట్ యాక్షన్ ఆన్ ఉమెన్ సేఫ్టీ అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు https://rfa.bebetter.run లింక్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కమిషనర్ సూచించారు.